అప్పుడే సినిమా విడిచిపెట్టారు. ఆ రోజు ఏదో కొత్త తెలుగు సినిమా... అందుకే జనం అలా ఉన్నారు. అర్ధరాత్రి దాటింది. ఆవులిస్తూ, దగ్గుతూ కలుగు వీడిన ఎలుకల్లా జనం బయటకు రాసాగారు.

రిక్షా ఎక్కేవాళ్లు రిక్షాలు, కార్లు ఎక్కేవాళ్లు కార్లు, సైకిళ్లు... రోడ్డంతా జనంతోను, బళ్లతోనూ నిండిపోయింది విశాఖపట్నం మెయిన్‌రోడ్డు.

ఆడవాళ్ళ గేటు దగ్గర రిక్షాతో నుంచున్నాడు కనకయ్య. ఎవరో యువతి ఎర్రగా సన్నగా ఉంది. ఉంగరాల జుట్టు, గులాబి రంగు సిల్క్ చీర, జాకెట్టు, మెడలో నగలూ ఉన్నాయి. గొప్పింటి పిల్లని ఇట్టే చెప్పవచ్చు.

ఆ యువతిని అల్లంత దూరంలోనే చూశాడు కనకయ్య. అదృష్టమే అనుకున్నాడు. కష్టానికి తగిన ఫలితం ఇస్తుందావిడ అనిపించింది. గబగబా వెళ్ళి "అమ్మా! రిక్షా కట్టమంటారా?" అని అడిగిన కనకయ్యవైపు అదోలా చూసింది ఆ యువతి. ముడతలు పడిన శరీరం, చప్పిడి దవడలు, పండిన మీసాలు, వీపునంటుకున్న



# విధిరాక్షసి

కడుపు... ఆ యువతి హృదయం జాలితో నిండిపోయింది.

"చాలా దూరం వెళ్ళాలి" అంది.

"ఎక్కడికమ్మా?" అన్నాడు కనకయ్య ఆశగా.

"అప్‌లాండ్స్"

కనకయ్య ఒక్కసారలా నుంచుండిపోయాడు. ఎక్కడి అప్‌లాండ్స్? జడ్జికోర్టు దాటాలి. కలెక్టర్ బంగళాదాటాలి. గవర్నర్ విడిది దాటాలి, యూనివర్శిటీ కూడా దాటాలి.

"ఎక్కండి!" అన్నాడు.

ఆమె డబ్బు గురించేమీ బేరం ఆడలేదు. గభాలున రిక్షా ఎక్కింది.

విశాఖపట్నం రోడ్లన్నీ ఎత్తుపల్లాలు. అందులో యూనివర్శిటీ రోడ్డు మరీనూ కనకయ్య బలంగా రిక్షా తొక్కుతున్నాడు.

ఆరోజు - అమావాస్యలా ఉంది చీకటి. రిక్షా ఊరు దాటి యూనివర్శిటీ రోడ్డుమీద నడుస్తోంది. రిక్షా బలంగా తొక్కుతున్నాడు కనకయ్య. అదంతా అడవి. సామాన్యంగా పగలు కూడా ఆ రోడ్డు మీద జనం తక్కువే.

చుట్టూ తాటిచెట్లూ... కొండలూ. ఇళ్ళు, దీపాలూ పేరుక్కూడా ఆ రోడ్డు మీద కనిపించవు.

ఆ యువతి చూస్తూ కూర్చుంది. చాలా భయంగా ఉంది. ఆమె ఆ రోడ్డు మీద చాలా హత్యలు జరిగాయని విన్నది. ఎవరయినా ఒక్కరే వెడుతూంటే... డబ్బున్న వాడయితే - వాడు తిరిగి రావడం కల్ల... శవం కూడా దొరకదట. చల్లగాలి బాగా వీస్తోంది. తాటిచెట్లు, కొబ్బరిచెట్లూ భయంకరంగా కనిపించసాగాయి.

"కనకయ్యా...!" ఎవరో ఆ నిశ్శబ్ధంలో, కీచురాళ్ళ శబ్దంలో కనకయ్యని పిలిచారు. అది కనకయ్యకే వినిపించింది.

"ఎవరూ!" అన్నాడు కనకయ్య.

"నేనూ..."

"నువ్వా! ఏం?"

"ఏం లేదు! నీకు మేలు చేద్దామని వచ్చాను"

"ఏమిటది?"

"ఏమీ లేదు? నీ పిల్లలు ఎలా ఉన్నారు? ఎండిపోయి అస్థిపంజరాల్లా చావు బ్రతుకుల్లో ఉన్నారు! నీ భార్యకి క్షయ - కడుపు నిండా తాగాలన్నా గంజి కూడా లేదు".

"అందుకని?"

"చేతికందిన అదృష్టాన్ని వదులుకుంటావా?"

"ఛీ! దొంగతిండి తినేకంటే... నీతి నిజాయితీగా బ్రతికి గంజితాగడం మేలు!"

**గీతా సుబ్రావ్**

"పిచ్చివాడా! ఆ నీతి నిజాయితీల కాలం దొర్లిపోయింది. అదీ మనిషిలాగే మట్టిలో కలిసి పోయింది. నీతి, నిజాయితీ అని కూచుంటే కడుపునిండదు ఈ రోజుల్లో".

"ఏమయినా కానీ... నేనా పని చెయ్యను".

"అయితే అనుభవించు" ఆ నీడ అదృశ్య మయింది. కనకయ్య మామూలుగానే రిక్షా తొక్కుతున్నాడు.

"ఆగు!" అన్నారు ఎవరో ఎదురుగా వచ్చి.

"ఎవరూ?..." అన్నాడు కనకయ్య.

"నేను... అదృష్టదేవతని" అన్నదా స్త్రీ ఆకారం.

"ఏం తల్లీ ఇలా వచ్చావు?"

"గ్రహించలేకపోయావా? వేల రూపాయల విలువగల వస్తువులున్న అమ్మాయిని ఒక్కదాన్నే నీ రిక్షాలో ఎక్కించాను. ఒంటరి ప్రదేశం, జన సంచారంలేని ప్రదేశానికీ తీసుకువచ్చాను. ఇక నువ్వు చెయ్యాల్సిన పని ఉంది".

"ఏమిటది?"

"రిక్షా ఆపడం... దిగడం - ఆ అమ్మాయి పీక నులిమి అవతల పారేసి... ఆ వస్తువులు తీసుకోవడం అంతే!"

అమ్మా! నేనూ ఈత కొడతానే... గారాలు పోయాడు కొడుకు.

వద్దు నాన్నా.. నది చాలా లోతుగా ఉంది ప్రమాదం.

మరి నాన్న ఈత కొడుతున్నాడుగా -

పర్వాలేదు - ఆయన లైఫ్ ఇన్సూరెన్స్ చేయించుకొన్నారు కదా!

"ఎందుకలా భయపడతావు? ఈ రోడ్డు మీద ఎన్ని హత్యలు జరగలేదు? ఆ కొండ వెనక్కి వెళ్ళు! ఆ లోయలో ఎన్ని అస్థిపంజరాలు ఉన్నాయో చూడు. కారు కింద పడ్డవాళ్ళు, లారీకింద పడ్డవాళ్ళూ - రహస్యంగా... వాళ్ళ శవాలను అక్కడే పారేస్తారు. నువ్వూ అక్కడే పారేయ్!"

"భయంగా ఉంది".

"ఎందుకూ? నువ్వు మగవాడివి కాదూ! పద్దెనిమిదేళ్ళ అమ్మాయిని చంపలేవూ... దిగు... దిగు!" ఆ స్త్రీ అద్దం తొలగింది, రిక్షా మెల్లగా వెడుతోంది. రోడ్డు ఎత్తుగా ఉంది.

రిక్షా వెనుక ఎవరో పరిగెత్తుకు రాసాగారు. ఆ అమ్మాయికి భయం వేసింది. ఆ పరిగెట్టి వస్తున్నవాళ్ళు చెయ్యి చాపేరు. పెద్దగోళ్లతో నల్లగా భయంకరంగా ఉన్నదా చేయి.

"ఎవరూ?" అనాలనుకుందా యువతి. కాని నోటంట మాటరాలేదు. ఆ యువతికేం తెల్సు? అది అకాలమృత్యువు అని.

రిక్షా ఆగింది. కనకయ్య క్రిందకు దిగాడు. యువతికి భయం ఎక్కువయింది?

'ఏం - ఆపేవ్?' అంది.

'చుట్ట ముట్టించేందుకు' అన్నాడు కనకయ్య తలపాగాలోంచి సగం కాలిన చుట్ట తీస్తూ -

చుట్ట వెలిగిస్తూ ఉండగా కనకయ్య ముఖం అగ్గిపుల్ల వెలుగువల్ల చక్కగా కనిపించింది. కన కయ్య చాలా భయంకరంగా ఉన్నాడు. కళ్ళలో ఏదో క్రూరత్వం, భయం, అన్నీ కనిపిస్తున్నాయి.

రెండడుగులు ముందుకు వేశాడు. "ఏయ్! దూరంగా ఉండు" అంది బెదురుతూ ఆ యువతి.




'ష్! నోరెత్తకు' అని కనకయ్య ఆమె చెయ్యి పుచ్చుకులాగేడు క్రిందకు! ఆ యువతి అరవ బోయింది! కాని కనకయ్య చెయ్యి ఆమె నోరుని బలంగా నొక్కేసింది. కనకయ్య రెండో చెయ్యి మెడమీద వేశాడు. ఆ యువతి ఏదో అపార్థం చేసుకుంది. బలంగా చెయ్యి కొరికింది కన కయ్యది.

కనకయ్య బాధ భరించలేక రెండు చేతుల్తో పీక నులిమేశాడు. అంతే మారుమాటలేకుండా కూలిపోయింది యువతి. వెంటనే ఆ యువతి శవాన్ని రిక్షాలో పడేసి రిక్షా ఎక్కాడు.

గవర్నర్ విడిది, యూనివర్శిటీ కూడా దాటే సింది రిక్షా. అదే అప్‌లాండ్స్. ఆ యువతి ఇల్లు అక్కడే. మరింత వేగంగా తొక్కేడు రిక్షా. సముద్రం హోరుమంటోంది. ఇంకా ముందుకు తొక్కితే సముద్రంలోకే... రిక్షా ఆపేడు కన కయ్య. అన్నీ మొగలి చెట్లు, కొబ్బరి చెట్లూ. కొబ్బరి చెట్ల మధ్య మొగలిపొద ఉంది. అక్కడికి వెళ్ళాడు. అంతా ఇసుకే. చేతుల్తో ఇసుకని లోతుగా తొలగించేసి గొయ్యితీశాడు. ఆ యువ తి శవాన్ని తీసుకువచ్చాడు. వస్తువులన్నీ వలి చేశాడు. అవన్నీ యెందులో కట్టాలో అర్థమ యింది కాదు. తలపాగా ఎక్కడోపోయింది. ఆ యువతి చీర గబగబా విప్పేసి అడ్డంగా తీసిన గోతిలో పడుకోబెట్టాడు. చీరలో నగలన్నీ కట్టుకొని, ఆ శవం మీద ఇసుకపోశాడు అంతే...

ఇది జరిగి నెలరోజులయింది.

ఆ అమ్మాయి కోసం విశాఖపట్నం అంతా వెతుకుతున్నారు. పేపర్లు అన్నిటిలోనూ ఆమె ఫొటో అచ్చయింది. ఆ అమ్మాయిని వెతికి యిస్తే వెయ్యినూట పదహార్లు బహుమానం. ఉంటేగా దొరకడానికి?

కనకయ్య మామూలుగా రోడ్డు పక్క నుంచు

న్నాడు. బాగా చిక్కిపోయాడు. మనిషి ఏమీ బాగులేడు. ఘడియకో గంటకో అనిపిస్తోంది.

ఎవరో యువకుడు - తెల్లగా ఉన్నాడు. గడ్డం బాగా మాసింది. ఇన్‌షర్టు, బూట్లు, చేతికి ఉంగరాలు ముప్పయ్యేళ్ళు పైన ఉంటాయి. ఆ యువకుడు కనకయ్యను అదోలా చూశాడు. అది కనకయ్య గమనించలేదు. "రిక్షా బాబూ" అన్నాడు.

"పోలీస్ స్టేషన్‌కు వస్తావా?" అన్నాడా యువకుడు, కనకయ్యలో చలనం లేదు. ఎక్కండి... అన్నాడు. ఆ యువకుడు రిక్షాలో ఉన్నంత సేపూ కనకయ్యనే పరిశీలిస్తున్నాడు! పోలీస్ స్టేషన్ వచ్చింది.

"నువ్వుండు" తిరిగి ఇంటికి దిగబెడుదువు గాని... ఇప్పుడే వచ్చేస్తాను" అంటూ లోపలకు వెళ్ళాడు ఆ యువకుడు.

"ఐతే... మీకు పూర్తి నమ్మకమేనా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

'ఆ... ఆ గులాబిరంగు చీర నా భార్యదే?' అన్నాడు యువకుడు.

"ఎవరికయినా గులాబి రంగు ఉండొచ్చు!"

"కానీ... చీర చివర నా భార్య మార్కింగ్ సిరాతో పేర్లు వేసేది. అది క్లియర్‌గా కనిపిస్తోంది. ఎల్ అంటే లీల అని అర్థం" అన్నాడా యువకుడు.

వెంటనే ఇన్‌స్పెక్టర్ కనకయ్యని అరెస్ట్ చేసి కొట్లో పెట్టాడు. కనకయ్య ఎముకలు విరగకుండానే నిజం ఒప్పుకున్నాడు. నగలన్నీ బీరు పోకుండా ఇచ్చేశాడు. కనకయ్య చెప్పిన గుర్తులను బట్టి శవాన్ని తెప్పించారు.

"నాకు ఆ అర్ధరాత్రి నా లీలని జాగ్రత్తగా

> నాన్నా! 'పెద్దపెద్ద మీసాలతో ఒకాయన మన గుమ్మంలో నిలబడి ఉన్నాడు' లోపలికి వచ్చి చెప్పాడు ఆరేళ్ల బుజ్జి.
>
> 'వద్దని చెప్పరా... నాకు ఉన్నాయి కదా మీసాలు... పేపర్లోంచి తల ఎత్తకుండానే సమాధానం ఇచ్చాడు తండ్రి.

తీసుకువచ్చి అప్పచెబితే నీకేది కావాలంటే అది ఇచ్చేవాణ్ణి" అన్నాడు ఆ యువకుడు కనకయ్యతో.

'నాకు అదృష్టం లేదు బాబూ... నేను దురదృష్టవంతుణ్ని! కాకపోతే... నెలరోజుల్లోగా ఒక్క నగయినా అమ్ముకొని... కడుపునిండా తిని... నా పిల్లలకి కడుపునిండా ఇంత అన్నం పెట్టేవాణ్ని కదా!... నన్ను నా పాపం వెంటాడకపోతే... అమ్మగారి చీర తలపాగాగా ఎందుకు చుట్టుకుంటాను? ఆ చీర నేను తలపాగాగా చుట్టకపోతే మీరు కనుక్కునేవారా? పాపం దాగదు బాబూ! నాలాంటి వాళ్ళకు ఇంతే కావాలి!!... అంటూ కుమిలి ఏడ్చాడు కనకయ్య.

'దురదృష్టవంతుడివి నువ్వు కాదు... నేను. కాస్తంత దానికి గంపంత చేసి... నా భార్యతో పోట్లాడేను! ఇంట్లోంచి పొమ్మని తిట్టాను. పుట్టిల్లు కూడా లేని లీల ఎక్కడికి వెళ్తుందనే జ్ఞానం లేకుండా పొమ్మని తిట్టాను. నా తొందరపాటుకి ఈ శిక్ష చాలదు. నీకు శిక్ష విధించే చట్టం నన్ను కూడా శిక్షిస్తే కానీ... నా పాపానికి ప్రాయశ్చిత్తం ఉండదు...' చిన్న పిల్లాడిలా ఏడుస్తూ...' పిచ్చివాడిలా గుణుస్తూ... వెళ్ళిపోయాడా యువకుడు...

*(35 ఏళ్ళ క్రితం విశాఖపట్నంలో నిజంగా జరిగిన కథ ఇది - అప్పుడు 'అప్‌లాండ్స్' మహారణ్యం)*